# అలలు



**జి.సి. జోషి**

జీవన రోదనవలె వినిపిస్తున్నది కడలి ఘోష. సాగరగర్భంలోంచి పుట్టుకొస్తున్న అలలు మూకిగా ప్రపంచాన్ని ముంచి వేయాలన్నంత కసితో విజృంభిస్తున్నాయి. చెలియలికట్ట నతిక్రమించలేక అవమానంతో తిరోగమించి రెట్టింపైన ఆవేశంతో తిరిగి తీరాన్ని ఢీకొంటున్నాయి. కడలి ఘోషతో నిమిత్తంలేని నగరం కళ్ళు మూస్తున్నది. రాత్రి పదకొండు గంటలు. నగరానికి కొంచెం దూరంలో బ్రతుకులోని నైరాశ్యానికి, విహ్వలంగా నిర్లిప్తతనూ, నిస్పృహనూ నింపుకున్నట్లు నిలిచివుంది వర్కింగ్ వుమెన్సు హాస్టలు. అప్పటికి గంట క్రితం వరకూ అర్థంలేని సందడితో, జీవంలేని కేరింతలతో అక్కడ ఒక వర్గపు జీవులు వూపిరి పీలుస్తున్నారని తెలిపిన ఆ హాస్టలు సద్దుమణిగి నిద్రపోతోంది. భర్తల కౌగిళ్ళలో దాంపత్య సుఖాన్ని, పొత్తిళ్ళ పాపలతో మాతృత్వపు మధురానుభూతులనూ అనుభవిస్తూ వుండవలసిన ఆ తరుణంలో, నాగరికత పన్నిన సాలెగూటిలో చిక్కుకుపోయిన అభాగినులు సత్రంలాంటి హాస్టలులో గమ్యం ఎరుగని కాందిశీకులవలె నిద్రపోతున్నారు.

ఆ సాలెగూడులో కోరివచ్చి తగుల్కొనకపోయినా విధిచే విసరివేయబడిన సుజాతకు మాత్రం ఆ రాత్రి కళ్ళు మూతలు పడలేదు, ఆలోచిస్తోంది. ఆలోచించినకొద్దీ అటూ ఇటూ పొర్లుతున్నదే కాని ఎటూ తేల్చుకోలేక పోతున్నది.

కొంతకాలంగా ఏ సమస్య అయితే ఎదురు కాకూడదని అనుకుంటూనే, మన

ట్లో ఒకమూల దాన్నే కోరుకుంటూ, భయపడుతూ వచ్చిందో అదే ఈనాడు రూపుదాల్చి ఆమెకు నిద్రపట్టకుండా చేస్తున్నది.

ఎరిష్యాంకోసం మంచంమీద వూరికే పొర్లడం తప్ప ఏమీ చేయలేక అలసిపోయి నిస్పృహాయంగా కళ్ళు మూసుకుంది సుజాత.

తడిసిన తలుపేదో చెంపక్కు దబ్బుగా తగలడంతో కళ్ళు తెరిచింది. కిటికీ గుండా జోరుగా వాన జల్లు పడుతున్నది. నిర్మలంగావున్న ఆకాశంలో మబ్బులు ఎప్పుడు కమ్ముకున్నాయో, వర్షం ప్రారంభమై ఎంతసేపయిందో ఆమె తెలుసుకోలేక పోయింది. లేచివెళ్ళి కిటికీ తలుపులు మూసింది. తళుక్కున మెరిసి ఫెళఫెళ వురిమింది ఆకాశం. గిరుక్కున భయంతో వెనుదిరిగి మంచంమీద వాలి పోయింది సుజాత.

దూరంగా ఎక్కడో పిడుగు పడింది!

పదేళ్ళనాడు సుజాత జీవితంలోకూడా పడింది పిడుగు.

* * *

జీవితంలో తనకిక లభ్యం కాదనుకున్న అదృష్టం కోరివచ్చి తనముందు నిలిచి నప్పుడు ఆనందంతో నోట మాటరాక ఉబ్బితబ్బిబ్బయింది సుజాత. అప్పుడామెకు పదహారేళ్ళు.

'నీ కిష్టమైతే నిన్ను వివాహం చేసుకుంటాను. ఏమంటావు సుజాతా!' అని కొండ బద్దలు కొట్టినట్టు నిలవేసి అతడు అడిగినప్పుడు ఆమె ఒళ్ళు జలదరించింది.

అనాథ బాలికల స్థితిగతులు తెలుసుకోవడానికి ఆశ్రమానికివచ్చిన పరిశీలక బృందంలోని మధుమూర్తితో ఆమెకు పరిచయం కావడం, అది నెల తిరక్కుండానే గాఢానురాగంగామారి అతనిచేత అలా అడిగించడం అంతా విచిత్రంగా జరిగి పోయింది. తన మెళ్ళో మంగళసూత్రం కడుతున్న మధుమూర్తి ఆమెకు మధుమూర్తిగా కనిపించలేదు. దేవుడికన్న గొప్పవాడయిన వ్యక్తిగానే కనిపించాడామె కళ్ళకు.

ఆ మొదటిరాత్రి తనముందు నిలబడ్డ ఆ మహోన్నతమూర్తి పాదాలకు మొక్కరిల్లింది సుజాత. కళ్ళనుండి రెండు నులివెచ్చని బిందువులురాలి అతని పాదాల మీద పడినయి. ఆమె భుజాలమీద చేతులు వేసి ఆప్యాయంగా లేవనెత్తాడు మధుమూర్తి. పసిపాపచేసే ఆ మాయికపు చేష్టను చూచి నవ్వినట్టు నిర్మలంగా నవ్వేడు.

'సుజాతా! మెచ్చుకుంటున్నంత గొప్ప కార్యమేమీ చెయ్యలేదు నేను. ఏదో పెద్ద త్యాగం చేశాననీ, ఉద్ధరించాననీ పిచ్చి పిచ్చి సెంటిమెంట్లు పెంచుకుని నన్నొక ప్రత్యేక దృష్టిలో చూడటం మాత్రం అలవాటు చేసుకోకు. అది మన ఆత్మీయతకు అడ్డు రాగలదు' తనేం మాట్లాడ గలదు. తన్మయురాలై అతని కౌగిలిలో కరిగిపోవడం తప్ప.

తిరుచిరాపల్లిలోని ఒక పెద్ద కంపెనీ నుంచి పిలుపు వచ్చింది మధుమూర్తికి రెండు రోజుల్లోవచ్చి వుద్యోగంలో చేరమని.

'సుజాత నీకొక మంచి వార్త' అని అతడా విషయం సంతోషంగా చెప్పినప్పుడు ఆమెకది మంచి వార్తగా వినిపించలేదు. వారం తిరక్కుండానే మధుమూర్తిని వదలి వుండవలసిన పరిస్థితికి ఆమె మనసులో బాధపడింది. అక్కడ ఇల్లూ అదీ ఏర్పాటు చేసుకుని తొందరలోనేవచ్చి తీసుకు వెళతానని చెప్పి బయలుదేరాడు మధుమూర్తి.

ఆ తరువాత...ఊహించలేక పోయింది సుజాత.

* * *

ఆకాశం భీకరంగా వురిమింది. కళ్ళు చిట్లిపోయేటట్లు కిటికీలోంచి దూసుకు వచ్చిందొక మెరుపు. సన్నగా వెలుగుతున్న లైటు ఆరిపోయింది. హాస్టలు భవనమంతా చీకటితో నిండిపోయింది.

సుజాత మళ్ళీ పుట్టింది. అవును... వారం రోజులు మాత్రమే జీవించిన తను అంతరించి మళ్ళీ పుట్టింది. దేవుడు... మధుమూర్తి...మొదటిరాత్రి...అంతా కల. వరమిచ్చిన దేవుడే వరాన్ని తిరిగి పుచ్చుకుని మాయమైనాడు... తను విగత భర్తృక కాదు. తనకసలు వివాహమే కాలేదు. అనాథ తను శరణాలయం తన ఆశ్రయం— ఈ మానసిక పరిణామం సుజాతలో బలంగా పనిచేసింది. ఆమె గతాన్నిమరిచి పోయింది. మరిచిపోయినట్లు అంతరాంతరాల్లో దృఢంగా నమ్మింది.

ఆగిపోయిన చదువును పూర్తిచేసింది. ఉద్యోగం సంపాదించింది. ఒక రకమైన తనకుమాత్రమే పరిమితమైన జీవితాన్ని అలవాటు చేసుకుంది. తన గతంగురించి ఆ నగరంలో ఎవరికీ తెలియదు. అందరికీ తను అవివాహిత.

'ఎప్పుడు పెళ్ళిచేసుకుంటావు?' అని ఎవరైనా అడిగినప్పుడు చిన్నగా నవ్వి మాత్రం వూరుకుంటుంది. 'సంఘాన్ని సంస్కరించాలన్నది తన ఉద్దేశం కాదు. ఆమాటకొస్తే సంఘమే తరతరాలుగా తన లాటి వాళ్ళను వంచిస్తూ వచ్చింది. ఈనాటికైనా తన స్థితిలోని స్త్రీపట్ల సంఘం ప్రవర్తన పూర్తిగా మారలేదు. ఎవరిమీద తెలియని తనకసిని, ద్వేషాన్ని — దాచుకోలేని ఆవేదనను కడిగేసుకోడానికి తనకు కనిపించిన మార్గం —గతాన్ని విస్మరించడం—లో ఉపశమనాన్ని ఒకింత శాంతిని పొందగలుగుతున్నది తను.

వర్షంజోరు తగ్గింది. ఉరుముల శబ్దంమాత్రం నిలిచి నిలిచి వినిపిస్తున్నది. లేతగా మెరుపులు మెరుస్తున్నవి హాస్టల్లో హఠాత్తుగా గుడ్డిదీపాలు వెలిగినయ్.

ఆ సాయంత్రం జరిగిన సంఘటన మరిచి పోయిందనుకున్న గతాన్ని గుర్తుకుతెచ్చింది సుజాతకు.

'సుజాత నిన్నొకటి అడగాలనుకుంటున్నాను. నన్ను వివాహం చేసుకోవడం నీ కిష్టమేనా?' అని తన కళ్ళల్లోకి సూటిగాచూస్తూ మహేశ్ అడిగినప్పుడు [illegible] సముద్రంపై [illegible] తను ఉలిక్కిపడింది. తనకు [illegible] కాదనుకున్న [illegible] తనముందు నిలబడి సవాలుచేసినట్లయింది. తనముఖం వివర్ణం కావడం గమనించిన మహేశ్ 'తొందరగా ఏంలేదు బాగా ఆలోచించుకొని నీ అభిప్రాయం చెప్పు' అంటూ లేచాడు.

ఆర్నెల్లక్రితం హైదరాబాదు బ్రాంచి నుంచి బదిలీ అయి తను పనిచేస్తున్న డిపార్టుమెంటుకి జూనియర్ ఆఫీసర్గా వచ్చిచేరిన మహేశ్ తనతో స్నేహం కొనసాగించాడు. కాదనలేకపోయింది. తెలియకుండానే అతనికి దగ్గరవుతూ వచ్చింది. అయినా లోపల భయం పీకుతూనే వుంది. కాదనుకున్న విషమసమస్య [illegible]

చెప్పాడు. ఇంతకాలం తన మానసికపు అట్టడుగుపొరల్లో అణగారివున్న ఒకచేదు నిజం బయటపడే సమయం ఆసన్నమైంది. ఏం చెయ్యాలి తనిప్పుడు? తను భర్తృవిహీన అన్న విషయాన్ని అతనిముందు బయటపెట్టడం ఎట్లా? అతనేమనుకుంటాడు? ఇంతకాలం తను అవివాహితగా నటించడంలోగల ఆంతర్యాన్ని వంచనగా అంచనా వేయడూ? కాదని అతనికి అర్థమయేలా ఎలా చెప్తుంది? మరిచి పోగలిగిందనుకున్న గతాన్ని తను నిజంగా మరువలేదు అన్నాళ్ళూ తన గుండెల్లో మంటలు రేగుతూనే వున్నాయి. ఈనాడు ఆ మంటలు బయటపడి దహించి వేస్తున్నాయి. ఆ మంటల్లోపడి తనతో బాటు అతడుకూడా దగ్ధం కాకూడదు. లేచివెళ్ళి టేబిల్ముందు కూర్చుని లైటు స్విచ్చి నొక్కింది సుజాత.

తెల్లవారుతూండగా ఉత్తరం పూర్తయింది. రాసినదాన్ని ఒకసారి చదువుకోడానిక్కూడా ధైర్యం చాల్లేదు. ఆవేదనా నిప్పులాంటి నిజాన్ని దాచుకున్న ఆ ఉత్తరం పేజీలు చిమ్ముతున్నట్లనిపించింది. రెండురోజులసెలవు చీటితో బాటు ఉత్తరాన్ని పోస్టుచేసి భారంగా వచ్చి నీరసంగా మంచంమీద వాలిపోయింది సుజాత.

# అలలు

మరుసటిరోజు సాయంత్రం వర్కింగ్ వుమెన్సు హాస్టలుముందు టాక్సీ ఆగింది. టాక్సీ దిగివస్తున్న మహేశ్‌ని శిలా ప్రతిమలా చూస్తూ నిలబడింది సుజాత.

మరో అర్థగంటకి ఇద్దరూ సముద్రం ఒడ్డున ఇసుకలో నడుస్తున్నారు. మంత్రముగ్ధలా అతణ్ణి అనుసరిస్తున్నది సుజాత. అలలకు కొంచెం దూరంగా ఒకచోట కూర్చున్నారు.

'సుజాతా' అన్నాడు మహేశ్.

విసురుగా వచ్చిన ఒక కెరటం సుజాత చీర అంచును తడిపి వెళ్ళిపోయింది. అలలకేసి చూస్తూ మాట్లాడలేదు ఆమె.

'మాట్లాడవూ సుజాతా?' ఎంతో మృదువుగా, నిర్మలంగావుంది అతని కంఠస్వరం.

ఆమె ఇంకా అటుకేసి చూస్తూనే వుంది.

'నీ వుత్తరం చేరింది.'

అయోమయంగా అతని ముఖంలోకి చూసింది సుజాత. చల్లగా వీచింది కడలి గాలి. మెల్లగా చెప్పసాగాడు మహేశ్—

'ఆ రైలు ప్రమాదం జరిగినప్పుడు నేనూ మధుమూర్తీ ఒకే పెట్టెలో ప్రయాణం చేస్తున్నాం. ఇద్దరం చిన్ననాటి స్నేహితులం. నీకు గుర్తులేక పోవచ్చు; మీ పెళ్ళికి వచ్చిన కొద్దిమంది అతిథుల్లో నేనూ ఒకణ్ణి.'

అలల శబ్దం వినిపించడం మానేసింది సుజాతకు. మరో లోకంలో ఎవరిమాటలో వింటున్నట్టు విస్తుపోయి వింటూ కూర్చున్నది.

'రైలు ప్రమాదం జరిగిన తరువాత స్పృహవచ్చి కళ్ళు తెరిచేసరికి ఇద్దరం ఆసుపత్రిలో ఒకే వార్డులో పక్కపక్కనే పడివున్నాము. కాని పరిస్థితులు మాత్రం వేరు. కొన్ని బలమైన గాయాలతో నేనూ, అంతిమ ఘడియల్లో అతనూ. మధుమూర్తి కోరికపైన నర్సు నా మంచాన్ని అతనికి దగ్గరగా జరిపింది. ఆ సమయంలో నేనక్కడ వున్నందుకు తనకెంతో సంతోషంగా వుందన్నాడు మధుమూర్తి.

'సుజాతను మళ్ళీ అనాథగా చేసి పోతున్నానన్న ఆవేదనా లేదు. సుజాత జీవితం అన్యాయం కాకూడదు. నీ చేతనైనంత సహాయం...' అంటూ ఆ పైన మాట్లాడలేక పోయాడు. అవే అతని చివరి మాటలుగా మిగిలి పోయినయి.

'కొద్ది రోజులకు ఆసుపత్రినుండి బయటపడి వచ్చాను. కాని సమయం మించిపోయింది. నీ జాడ తెలియలేదు. ఎక్కడికి వెళ్ళిందీ తెలియదన్నారు.


'ఆ తరువాత పెళ్ళి చేసుకున్నాను. సంవత్సరం తిరక్కుండానే ఆమె ఎవరితోనో లేచిపోయింది.

'ఆఫీసులో చేరినరోజు నిన్ను చూసి ఆశ్చర్యపోయాను. ఎందుకో నువ్వు కొంత మారినా అమ్మాయిలాగానే నీ కళ్ళను బట్టి నిన్ను పోల్చుకోగలిగాను.'

పెద్ద అల ఒకటి ఇద్దరి కాళ్ళమీద పడింది.

అతణ్ణి ఏదో అడగబోయింది సుజాత.

'ఉండు నన్ను చెప్పనీ. అప్పుడు ఈ విషయాలన్నీ నీకు చెప్పలేదు. గతాన్ని నీకు గుర్తు చేయకూడదనుకున్నాను అంతే కాదు. నేనేదో జాలికోసమో, స్నేహితుడి కిచ్చిన మాటకోసమో నిన్నుద్ధరిస్తున్నట్టు నీ వనుకుంటావని నేననుకున్నాను. గతంతో నిమిత్తం లేకుండా నిష్కళంకంగా, నిర్మల చిత్తంతో మనిద్దరం ఒకటవ్వాలన్నది నా వుద్దేశం. నువ్వు వుత్తరం వ్రాసి నాకు



తెలిసిన నీ గతాన్ని గుర్తుచేసి వుండక పోతే నా గతాన్ని కూడా నేను నీకు తెలిపివుండే వాడిని కాదు. ఇంకా సంతోషించే వాడిని. జరిగిందాక పీడ కలగా త్రుంచేసుకుని నూతన జీవితం ప్రారంభించాలని ప్రయత్నించాను నీలాగే కాని ఈ నాడు మన ప్రయత్నం విఫలమయింది నాకు తెలియదనుకుని నీ గతాన్ని నాకు విప్పి చెప్పావు. నీకు తెలియక పోయినా గతాన్ని నెమరు వేసుకున్నాను నేను.

సుజాతా! జీవితంలో మనతో నిమిత్తం లేకుండా జరిగే కొన్ని చేదు సంఘటనలను నెమరు వేసుకుంటూ, బ్రతికి వున్నంతకాలం బాధపడుతూ జీవితాన్ని వ్యర్థం చేసుకోవటం అవివేకంగా భావిస్తాను నేను' చెప్పడం ఆపి దీర్ఘంగా వూపిరి పీల్చి వదిలాడు మహేశ్.

అలలకేసి చూసింది సుజాత. ఒకదాని వెంబడి ఒకటి నిర్విరామంగా వస్తూనే వున్నయ్. ఒడ్డుకు తగిలి ఒక్కొక్క కెరటం విరిగిపోతూనే వుంది. కాని అలలు కొట్టడం ఆగిపోలేదు పోటీ పడుతూ. వువ్వెత్తుగా లేచి పడుతూ లేస్తూ, కేరింతలతో అలజడితో, సందడితో ఆగిపోకుండా వస్తూనే వున్నయ్ అలలు.

'నాకు నీళ్ళలో నిలబడాలని వుంది' అన్నది సుజాత

వింతగా చూశాడు మహేశ్.

'మీరూ రండి' అన్నది. ఆమె ప్రవర్తన కొత్తగా అనిపించింది అతనికి మాట్లాడకుండా ఆమె వెంబడి లేచాడు

అతని చేయిపుచ్చుకుని ముందుకు నడిచింది. ఒక పెద్దకెరటంవచ్చి వాళ్ళిద్దరినీ మోకాళ్ళదాకా తడిపింది.

'ఇకరండి వెళ్దాం' అన్నది సుజాత.

దూరంగా చీకటిలో కదిలే ఓడలకు దారి చూపుతూ కాంతిని వెదజల్లుతున్నది లైట్‌హౌస్. ఇద్దరూ ఒకరినొకరు అనుకుని ఆ తడి ఇసుకలో తిన్నగా అటుకేసి నడుస్తున్నారు.

వారి అడుగుజాడలను చెరిపి వేయడానికి ఇష్టంలేనట్లు అలలువెనక్కి జారుతుంటున్నయి. ●

